క్లుప్తంగా

నేడు ప్రత్యేక మహాజన సభ

అలంపూర్: ప్రత్యేక మహాజన సభ సమావేశం ఆదివారం నిర్వహిస్తున్నట్లు అలంపూర్ పీఏసీఎస్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అలంపూర్ సహకార సొసైటీ పరిధిలోని రైతులు, రైతు సంఘాలతో సహకార సొసైటీలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్యాతూర్ సొసైటీలో..

క్యాతూర్ సహకార సొసైటీ ఆధ్వర్యంలో ప్రజా మహాజన సభ సమావేశం నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ రాఘవరెడ్డి, కార్యదర్శి హుస్సేన్‌పీర ఒక ప్రకటనలో తెలిపారు. రైతు వేదికలో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ఉన్నట్లు పేర్కొన్నారు.

గట్టు: మండల కేంద్రంలోని రైతు వేదికలో సహకారం సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటలకు మహాజన సభను నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు వెంకటేష్ తెలిపారు.

మానవపాడు: ప్రత్యేక మహాజన సభలో సలహాలు, సూచనలు తీసుకోవడానికి సోమవారం ఉదయం 10గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నామని పీఏసీఎస్ సీఈఓ మద్దిలేటి ఒక ప్రకటనలో తెలిపారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

గద్వాల రూరల్: అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను ఇవ్వాలని గద్వాల వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ నాయకులు కోరారు. ఈమేరకు వారు శనివారం కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ప్రైవేటు పాఠశాలలో జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులు రవీందర్ రెడ్డి, రామకృష్ణ, మురళి, శ్రీనివాసులు, పురెందర్, సూరి, వెంకటేశ్, రమేష్, జాన్, కిరణ్‌పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

మానవపాడు: ఉత్తమ సేవలు అందించినందుకుగాను జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సయ్యద్ ఇర్షాద్ నేషనల్ క్వాలిటీ అసురెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) అవార్డు అందింది. ఈ నెల 28న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ఆయుష్మాన్ భారత్ గుణవత్త్ స్వాస్థ్య కార్యక్రమంలో ఆరోగ్య, జపత్ కుటుంబ సంక్షేమశాఖ మంత్రి ప్రతాప్ సమక్షంలో అవార్డులు అందజేశారు. ఆరోగ్యకేంద్రలో ఎన్‌క్యూఏఎస్‌లో ఉత్తమ సేవలు కనబరిచినందుకు అవార్డు అందిచారని తెలిపారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

అలంపూర్: ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీం పాష కోరారు. అలంపూర్ చౌరస్తాలోని ఒక ప్రైవేటు పాఠశాలను శనివారం సందర్శించగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తుండడాన్ని గమనించి ఎంఈఓకు సమాచారం ఇచ్చారు. ఎంఈఓ శివప్రసాద్ అక్కడికి చేరుకొని పుస్తకాలను తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలో ఫీజులు నియంత్రణ చట్టం ఖచ్చితంగా అమలు చేయాలని అన్నారు.

నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచాలి

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోయే వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకుగాను అన్నీ ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసుకొని నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నర్సింగ్‌రావు అధికారులకు ఆదేశించారు. శనివారం ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని కోదండాపురం, శివనంపల్లి జీపీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ రికార్డులను తనిఖీ చేసి నర్సరీలలో పెంచుతున్న మొక్కలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, ఏపీఓ శివజ్యోతి, కార్యదర్శులు రాధిక, మద్దిలేటి, ఉపాధి సిబ్బంది, తదితరులు ఉన్నారు.

రైండు బైక్‌లు ఢీ : ఇద్దరికి గాయాలు

మానవపాడు: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన యుగంధర్ బైక్ మీద గాంధీచౌక్ వైపు నుంచి మానవపాడు ఎక్స్‌రోడ్డు దారిలో వస్తున్నాడు. అదే సమయంలో చెన్నిపాడు గ్రామానికి చెందిన ఆంజి వేముల దగ్గర ఓ కోల్డ్ స్టోరేజీలో కూలి పనులు ముగించుకోని మానవపాడు ఎక్స్‌రోడ్డు నుంచి చెన్నిపాడు వైపు బైక్‌పై మరో వ్యక్తిని ఎక్కించుకొని వెళ్తున్నాడు. రెండు బైక్‌లు అల్లాబకాష్ ఇంటి ముందు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో యుగంధర్ రైట్‌చెస్ట్ భాగంలోగాయాలు కాగా, ఆంజనేయులుకు ముక్కుకు గాయామైంది. ఆంజి బైక్‌పై ఉన్న మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అలంపూర్ రూరల్: తుంగభద్ర నది నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ నాగరాజు వివరాల ప్రకారం.. రాయలసీమ, కర్నూల్ జిల్లా పంచలింగాలకి చెందిన రాజు నది నుంచి అక్రమంగా అలంపూర్ మున్సిపాలిటీ ఇమాంపురం ఇసుక ట్రాక్టరను తరలిస్తుండగా పీసీ ఆంజనేయులు పట్టుకున్నాడు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

నిఘా నేత్రం.. పరిష్కార చిత్రం

- నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు
- అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని పోలీసుల సూచన
- అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటుతో భద్రతకు భరోసా



మానవపాడులో సీసీ కెమెరా రికార్డును మానిటరింగ్‌లో పరిశీలిస్తున్న ఎస్‌ఐ చంద్రకాంత్



మానవపాడు గాంధీచౌక్ ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

మానవపాడు: నేరాల నియంత్రణకు పోలీస్‌లు డేగ కన్ను వేశారు. ప్రధానంగా శాంతిభద్రతలు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మానవపాడు మండలంలోని ఆయా గ్రామాలను నిఘానేత్రం కిందకు తీసుకొచ్చారు. మండలంలోని ఆయా గ్రామాల్లో భద్రతకు పూర్తిస్థాయిలో భరోసా కల్పించేందుకు పోలీస్‌లు చర్యలు చేపట్టారు. సమాజంలో రోజురోజుకు నేరాలు పెరుగుతున్నాయి. జిల్లా, మండల, పట్టణ, కేంద్రాలు విస్తరిస్తుండటంతో ఎక్కడ ఎలాంటి నేరా సంఘటన చోటుచేసుకుంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు పోలీస్‌శాఖలో సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఫలితంగా నిందితులను పట్టుకోవడం కష్టమౌతోంది. ఈ నేపథ్యంలో పోలీస్ అధికారులు నేరాలను అరికట్టేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా పలు కేసులకు పరిష్కారం లభిస్తుంది. ఎలాంటి ప్రమాదం జరిగినా వెంటనే అందుకు కారణమైన వాహనాలను గుర్తించే అవకాశం ఏర్పడింది. ప్రమాదానికి కారణమైన వాహనాలను, నిందితులను పోలీసులు సులభంగా గుర్తిస్తున్నారు. దీంతో బాధితులకు సత్వరన్యాయం జరుగుతోంది. సీసీకెమెరాల ద్వారా నమోదైన దృశ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

ప్రజలకు దగ్గరవుతూ..

రాష్ట్ర ప్రభుత్వం స్నేహపూర్వక పోలీస్ విధానాన్ని కొనసాగిస్తున్న నేపథ్యంలో ప్రజలకు దగ్గరవుతూనే ప్రజల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. మానవపాడు మండలంలోని ఆయా గ్రామాల వారీగా.. 24 గంటల నిఘా ఉండనుంది. మండలకేంద్రంలో–7, మానవపాడు స్టేజీ జాతీయ రహదారి వద్ద –4, చంద్రశేఖర్‌నగర్ స్టేజీలో –3, కొర్విపాడులో –4 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాలను గ్రామ రైతుసంఘం, గ్రామపెద్దల సహకారంతో ఏర్పాటు చేశారు. మండలంలో 21 కెమెరాలను ఆయా గ్రామాలలో 4 కెమెరాలు తీసుకొచ్చి ప్రధానమైన చోట్ల ఏర్పాటు చేసి నిఘా పటిష్ఠం చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపులోకి తీసుకొస్తున్నారు. ప్రధానంగా దొంగతనాలు, చైన్‌స్నాచింగ్, మోసాలు, ఈవ్ టీజింగ్ తదితర సంఘటనలు అరికట్టేందుకు అవకాశం ఏర్పడింది. సీసీ కెమెరాల ఏర్పాటుతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిఘా ఉంటుంది.

నేరాలు అరికట్టనున్న త్రినేత్రం..

త్రినేత్రం వల్ల నేరాలు అరికట్టవచ్చు. మండలంలోని ఆయా గ్రామాల వారీగా నేరాలను అదుపులోకి తీసుకొచ్చేందుకు నిఘా కెమెరాలు ఉపయోగపడుతున్నాయి. నేరస్తులు, దొంగలు, ఇతర అనుమానితుల కదలికలను పసిగడుతుంది. దొంగతనాలు, దోపిడీలు చేయడానికి దొంగలు వెనకడుగు వేస్తారు. ఇంటికి తాళాలు వేసినప్పుడు రక్షణగా ఉంటాయి. ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే గుర్తుపట్టే అవకాశం ఉంటుంది.

నేను సైతంలో ప్రజల భాగస్వామ్యం..

మండలంలోని ఆయా గ్రామాలలో నేనుసైతం కార్యక్రమం ద్వారా ప్రజలను భాగస్వాములను చేస్తున్నారు. ప్రతిగ్రామంలోనూ సీసీ కెమెరాలపై అవగాహన కల్పించి, ప్రజలను చైతన్య పరుస్తున్నారు. నేను సైతం కార్యక్రమం ద్వారా వాణిజ్య, వ్యాపార, వర్తక సంఘాల ప్రతినిధులతో సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

> **నేరాల నియంత్రణకు తోడ్పాటు**
>
> 
>
> సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణకు సాధ్యమైంది. నిందితులను పట్టుకోవడం సులభం అవుతుంది. నేరాలు అదుపులోకి వస్తాయి. భద్రతపరంగా బాగుంటది. వాటితో కేసుల ఆధారాలు లభ్యమౌతున్నాయి. రోడ్డు ప్రమాద సంఘటనలు, చోరీల సంఘటనల ఆధారాలు లభిస్తున్నాయి. మండల కేంద్రంలోని జాతీయ రహదారి కూడలి వద్ద, మానవపాడు ప్రధాన కూడళ్ల వద్ద, 21 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి శాంతిభద్రతల పరంగా కట్టుదిట్టంగా చేసేందుకు కృషి చేస్తున్నాం.
>
> – చంద్రకాంత్, ఎస్ఐ మానవపాడు

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

జెడ్పీ చైర్‌పర్సన్ సరిత



మల్దకల్‌లో కూరగాయల షెడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత

మల్దకల్: పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. శనివారం మల్దకల్ సంత బజారులో కొత్తగా నిర్మిస్తున్న కూరగాయల షెడ్ల నిర్మాణానికి జెడ్పీ చైర్‌పర్సన్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి నిరంతరం పాటు పడుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని మరింత అభివృద్ధి చెందాలన్నారు. రూ.15లక్షలతో ఏర్పాటు చేస్తున్న షెడ్లను నాణ్యతతో నిర్మించాలని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌బాబు, రామచంద్రారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రామకృష్ణ, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌గౌడు, గోపాల్, రాజశేఖర్, గోవిందు, మల్దకల్, రాముడు, చిన్నతిమ్మన్న పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో పూజలు

ఆదిశిలా క్షేత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, అర్చకులు, ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శేషవస్త్రంతో సత్కరించి స్వామి వారి మెమొంటోను ఆమెకు అందజేశారు.

పదవీ విరమణ చేసినా సూచనలు అందించాలి

ఉండవెల్లి: పదవీ విరమణ పొందిన గద్వాల్ జిల్లాలోని మండల, గ్రామ స్థాయి అధికారులకు ఎంపీడీఓ జబ్బార్ సూచనలు సలహాలు అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీఓ అబ్దుల్ జబ్బార్ పదవీ విరమణ కార్యక్రమంలో జిల్లా, మండల అధికారులు సన్మానం చేశారు. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, మహబూబ్‌నగర్ జెడ్పీ సీఈఓ ముషాయిదా బేగం హాజరయ్యారు. ఎంపీపీ బీసమ్మ, వైస్ ఎంపీపీ దేవ న్న, ఎంపీఓ పద్మావతి, అధికారులు ఉన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు కాదని ట్యాంపరింగ్ పరీక్షలు

గద్వాల క్రైం: కల్లుగీతా కార్మికుల ముసుగులో అనర్హులైన వ్యక్తులకే ట్యాంపరింగ్ పరీక్షలు నిర్వహించారంటూ గద్వాల కల్లు సొసైటీ సభ్యులు తులసీగౌడు, వెంకటేష్ గౌడులు శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గద్వాల జిల్లాకు చెందిన 18 మంది గీతా కార్మికుల ముసుగులో అనర్హులైన వ్యక్తులకు ఇటీవల జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారులు కల్లు గీసేందుకు లైసెన్సులు జారీ చేశారన్నారు. ఈ విషయంపై హై కోర్టులో లైసెన్స్ మంజూరుపై అభ్యంతరం వ్యక్తం చేసిందన్నారు. లైసెన్స్‌లు మంజూరు చేసిన 18 మంది వ్యక్తులకు పిటిషనర్, గ్రామస్తుల సమక్షంలో ట్యాపింగ్ పరీక్షలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లా ఎక్సైజ్‌శాఖ అధికారులు శనివారం అభ్యంతరం తెలిపిన వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గుట్టుగా ట్యాపింగ్ పరీక్షలు నిర్వహించారన్నారు. ఈ విషయంపై 'సాక్షి' జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి అరుణ్‌కుమార్‌ను వివరణ కోరగా, నిబంధనల ప్రకారమే ట్యాంపింగ్ పరీక్షలు నిర్వహించామని, వీడియో రికార్డు, గ్రామస్తుల సమక్షంలో ట్యాపింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఫీల్డ్ ఆఫీసర్లకు ఘన సన్మానం



ధరూరు: మండల కేంద్రంలోని ఏపీజీవీ బ్యాంకులో పని చేసి బదిలీపై వెళ్తున్న ఫీల్డ్ ఆఫీసర్లను బ్యాంకు సిబ్బంది ఘనంగా సన్మానించారు. శనివారం సాయంత్రం బ్యాంకు ఆవరణలో వారిని శాలువా పూలమాలలతో సన్మానించారు. ఇక్కడ మూడేళ్ల పాటు పని చేసిన ఫీల్డ్ ఆఫీసర్ హుస్సేన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పార్వతీపురానికి బదిలీపై వెళ్తున్నారు. కిషోర్ కుమార్ హైదరాబాద్ చౌటుప్పల్‌కు బదిలీపై వెళ్తున్నారు. వారిద్దరిని బ్యాంకు మేనేజర్ విశాల్ రాజ్, క్యాషియర్ రాధ, అకౌంటెంట్ రేవతి, షఫీ, చిరు తదితరులు ఘనంగా సన్మానించారు. సెర్ప్ ఉద్యోగులు, బ్యాంకు మిత్రలు, ధరూరు గ్రామ ప్రజలు, ఖాతాదారులు పాల్గొన్నారు.

చదువుకుంటేనే బంగారు భవిష్యత్



రాజోళి: స్వేచ్ఛాయుత వాతావరణంలో బాలికలు చదువుకుంటేనే బంగారు భవిష్యత్ లభిస్తుందని ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి హనిమిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కిశోర బాలికల సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు తమ సమస్యలను దాచుకోకుండా ధైర్యంగా చెప్పి, హక్కులను ఉపయోగించుకోవాలన్నారు. బాల్య వివాహాలను గుర్తించి 1098కు ఫోన్ చేయడం, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు సహకరించడంతో పాటు, విద్యాహక్కు చట్టాలను తెలుసుకుని, తమకు, తమతో పాటు చదువుతున్న వారికి అందాల్సిన ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆట పాటల ద్వారా కిశోర బాలికలు చేయాల్సిన పనులు ఆడి చూపించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం భగీరథ రెడ్డి, పాఠశాల సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'డబ్బులు వసూలు చేయలేదు'

గద్వాల రూరల్: గద్వాలలో నామినేటెడ్ పదవులకు సంబంధించి ఎవరి దగ్గర డబ్బులు వసూలు చేయలేదని, ఎవరు కూడా డబ్బులు ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కౌన్సిలర్ శంకర్, మహ్మద్ ఇసాక్, గట్టు కృష్ణమూర్తి, అమరాయి కృష్ణారెడ్డి, లక్ష్మణ్, మాల శ్రీనివాసులు, గట్టు సత్యనారాయణ, గోవర్ధన్, శేఖరయ్య, గణేష్‌లు అన్నారు. ఈ మేరకు వారు శనివారం పత్రికాప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిదని పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువ ఉందని, అందరూ అభిప్రాయాలు చెప్పేందుకు అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం సహజమన్నారు. కొందరు గిట్టనివారు పదవులు అమ్ముకుంటున్నారనే దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పార్టీ అభివృద్ధి కోసం పనిచేసిన వారికి సామాజిక న్యాయం చేసేలా పదవులు వస్తాయన్నారు.

భక్తులతో పోటెత్తిన ఆదిశిలాక్షేత్రం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి వచ్చిన భక్తులతో ఆదిశిలాక్షేత్రం ఆవరణ కిటకిటలాడింది. వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారికి దాసంగాలు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. శనివారం వారాంతపు సంత కావడంతో ఆలయ ఆవరణ మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, ఆలయ అర్చకులు రమేషాచారి రవిచారి, చంద్రశేఖర్‌రావు, నాగరాజుశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలకు నోట్‌బుక్స్ పంపిణీ



మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో పాఠశాలలకు శనివారం నోట్‌బుక్స్ వచ్చాయని ఎంఈఓ శివప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని కొన్ని పాఠశాలలకు నోట్‌బుక్స్ పంపిణీ చేశామని, మరికొన్ని పాఠశాలలకు అందిస్తామన్నారు. మొత్తం 13,100 నోట్‌బుక్స్ వచ్చాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్ నిర్వహణ

మానవపాడు: చట్ట వ్యతిరేక శక్తులను కట్టడి చేసేందుకు విస్తృత తనిఖీ చేస్తున్నామని విజిబుల్ పోలీసింగ్ పటిష్ఠంగా అమలు చేస్తేనే నేరాలు నియంత్రణ సాధ్యమని ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తున్నామన్నారు. రోడ్లపై తోటి వాహనదారులను ఇబ్బందులు గురిచేస్తే, ర్యాష్ డ్రైవింగ్ పాల్పడినా, అసౌకర్యంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి వాహనాలు నడిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షం

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపల్ కేంద్రంలో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వారం రోజులుగా వర్షాలు లేక పొలాల్లో సాగుచేసిన పంటలు వాడుబట్టి ఎండిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. సాయంత్రం కురిసిన వర్షంతో మొక్కలకు ప్రాణం పోసినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

రైతు భరోసాను సద్వినియోగం చేసుకోండి

శాంతినగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసాను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవింద్‌నాయక్ రైతులకు సూచించారు. పీఏసీఎస్ వడ్డేపల్లి ఆధ్వర్యంలో ప్రత్యేక మహాజన సభ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయశాఖ అధికారి హాజరై రైతు భరోసాపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ ఆడిటర్ యశోదమ్మ, పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మీరెడ్డి, సంఘం డైరెక్టర్లు వెంకట్రామన్‌గౌడ్, దుబ్బన్న, పెద్దమూగెన్న, దస్తగిరి, వెంకటేశ్వర్లు, వడ్డేపల్లి, రాజోళి మండలాల రైతులు పాల్గొన్నారు.

హాస్టళ్లకు నిధులు మంజూరు చేయాలి

- ఎస్సీ హాస్టల్స్ సమస్యలపై కేవీపీఎస్ సర్వే



అలంపూర్‌లోని హాస్టల్స్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకులు

అలంపూర్: రాష్ట్ర ప్రభుత్వం సాంఘీక సంక్షేమ హాస్టళ్లకు నిధులు కేటాయించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. అలంపూర్ పట్టణంలోని ఎస్సీ హాస్టళ్లను కేవీపీఎస్ నాయకులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశమై హాస్టళ్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న సాంఘీక సంక్షేమ హాస్టళ్లలో మరమ్మతులు చేపట్టాలన్నారు. జిల్లాలో 29 ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు ఉన్నాయన్నారు. కానీ వాటిలో 5 వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. హాస్టళ్లకు సొంత భవనాలు, ప్రహరీలు లేవన్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు ఆటస్థలాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలంపూర్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉన్నా, వాటికి నల్లాలు, తలుపులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. జిల్లా ఉన్నత అధికారులు సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే తక్షణమే విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు వెంకటస్వామి, నాగరాజు తదితరులు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించండి



మున్సిపాలిటీలోని 12వ వార్డులో పర్యటిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అయిజ: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరారు. శనివారం మున్సిపాలిటీలోని 12వ వార్డులో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, మున్సిపల్ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. డ్రెయినేజీల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దాని వల్ల దోమల ఉధృతి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో చేపట్టిన వివిధ కట్టడాల వల్ల వాటి వ్యర్థాలు రోడ్డుపై పడి ఉండడంతో ప్రయాణానికి ప్రతికూలంగా మారిందన్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆయా కాలనీల్లో పర్యటించి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ గోపాల్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మన్న, జూనియర్ అసిస్టెంట్లు విజయ్, పవన్, ప్రకాష్, వార్డు ఆఫీసర్లు, లైన్‌మెన్‌లు, బిల్ కలెక్టర్లు, జవాన్లు, ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు.

రాజకీయ ప్రస్థానంలో డీఎస్‌ది ప్రత్యేక ముద్ర



డీ శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గద్వాల రూరల్: ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ అధ్యక్షుడుగా కొనసాగడంతో పాటు తెలంగాణ ఉద్యమ సమయంలో, కాంగ్రెస్ రాజకీయ ప్రస్థానంలో డీ.శ్రీనివాస్ ప్రత్యేక ముద్ర వేసుకున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. డీ శ్రీనివాస్ మృతి చెందడంతో శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, నాయకులు గట్టు తిమ్మప్ప, మధుసూదన్ బాబు, ఇసాక్, నరహరి గౌడ్, శ్రీనివాసులు ఉన్నారు.

విద్యార్థులకు బస్‌పాసులు ఇవ్వండి



ఆర్టీసీ డిపో మేనేజర్ మంజుల రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

అయిజ: విద్యార్థులకు బస్‌పాస్‌లు సకాలంలో ఇవ్వాలని ఏబీవీపీ నాయకులు కోరారు. శనివారం ఆర్టీసీ డిపో మేనేజర్ మంజులరెడ్డిని ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల విద్యార్థులు మండల కేంద్రానికి చదువుకునేందుకు పాఠశాలలకు, కళాశాలలకు వస్తున్నారని, బస్‌పాసులు తీసుకునేందుకు గద్వాలకు రావాలంటే సెలవులు పెట్టి రావాల్సి ఉంటుందని, వ్యయ ప్రయాసాలకు గురికావాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు అయిజ ఆర్టీసీ ప్రాంగణంలోనే బస్‌పాస్‌లు ఇవ్వాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. అన్ని గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించాలని, పాఠశాలల సమయానికి బస్‌లు నడపాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు వెంకటేష్, పవన్, నరేష్ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలి



మల్దకల్‌లో మాట్లాడుతున్న సీడీపీఓ కమలాదేవి

మల్దకల్: గర్భిణులు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సీడీపీఓ కమలాదేవి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మల్దకల్, గట్టు, అయిజ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు నెలనెలా క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే బాలామృతం సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగరాణి, బాలమ్మ, యామిని, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

అలంపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగమద్దిలేటి ఆరోపించారు. అలంపూర్ పట్టణంలోని టూరిజం హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠంగా జోగులాంబ అమ్మవారు కొలువైన అలంపూర్‌లో ఉన్న ఇంటర్ బాలికల, బాలుర హాస్టళ్లను తరలించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఈ ప్రాంత విద్యార్థులకు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఉన్న హాస్టళ్లను తరలించడం సరైంది కాదన్నారు. గతంలో ఇక్కడ ఉన్న డిగ్రీ కళాశాలను తరలించి గత ఎమ్మెల్యే ప్రజను మోసం చేశారన్నారు. జోగుళాంబ అమ్మవారిని మోసం చేస్తే కాంగ్రెస్ పార్టీ అదే గతిపడుతుందన్నారు. హాస్టల్స్ తరలించే నిర్ణయం వెనక్కి తీసుకోవాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు బంగారు లక్ష్మణ్, మహేష్, శరత్ బాబు, మద్దిలేటి, జగదీష్, కృష్ణ ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: మండలంలోని కొండేరుకు చెందిన తెలుగు చంద్రన్న మృతి చెందడంతో పోతురాజు శంకరమ్మ సేవాదలం సభ్యులు బాధిత కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థిక సాయం చేశారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఉండవెల్లి: అలంపూర్ చౌరస్తాలో ఈ నెల 25న దూప దీప నైవేద్య అర్చకుల సమావేశంలో ముగ్గురు వ్యక్తులు అలంపూర్ ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మను దూషించినట్లు శనివారం ఫిర్యాదు చేడంతో ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అర్చకుల ఆత్మీయ సమ్మేళనంలో జోగుళాంబ ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మను దూషించిన వాసుదేవ శర్మ, అశోక్, లక్ష్మీకాంతాచార్యులపై ఆనంద్ శర్మ ఫిర్యాదు చేశారు. ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.